ప్రజాశక్తి
బుధవారం 29 మార్చి 2023
5
అల్లూరి సీతారామరాజు



మత్తు పదార్థాలకు చిత్తు కావొద్దు!

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జీవితాన్ని సర్వనాశనం చేసే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని వికలాంగుల సంక్షేమశాఖ ఎడి జె.మాధవి హితవు పలికారు. మంగళవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం, రవాణా వల్ల ఒక వ్యక్తికి కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన శిక్షలు, సామాజిక వెలివేత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడు వ్యసనాలను ప్రోత్సహిస్తున్న వారిపై పోలీసులకు, ఎక్సైజ్ పోలీసులకు లేదా 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉద్యోగాల సాధనకు కృషి చేసి భవిష్యత్ బంగారు బాట వేస్తూ తల్లిదండ్రులకు, సమాజానికి మేలు చేయాలన్నారు.కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ రమేష్, సైకియాట్రిస్ట్ డా.శివరామకృష్ణ, ఎక్సైజ్ సిఐ సంతోష్, ఎన్ టిసిపి నోడల్ వర్కర్ శాంతి కుమారి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌ను జయప్రదం చేయండి



లోతుగెడ్డ జంక్షన్ సంతలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -పాడేరు: ఈనెల 31న గిరిజన ప్రజాసంఘాల పిలుపునిచ్చిన రాష్ట్ర ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ కోరారు. మంగళవారం లోతుగెడ్డ జంక్షన్ సంత కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో మన్యం బంద్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 24న బోయ/వాల్మీకులు బెంతుకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ వైసిపి ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానించి, కేంద్రానికి నివేదించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా చేపట్టే మన్యంబంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఏజెన్సీ బంద్‌కు అన్ని వ్యాపార వర్గాలు సహకరించాలని, గిరిజన నిరుద్యోగ యువత, మేధావులు, విద్యావంతులు, మహిళలు అందరూ పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, కిల్లో సింహాచలం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాంగి జీవన్‌కృష్ణ, సిహెచ్ ప్రేమ్ కుమార్, మామిడి ప్రసాద్ పాల్గొన్నారు.

పాడేరు : బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ 31న గిరిజన సంఘం రాష్ట్ర మన్యం బంద్ పోస్టర్‌ను గుర్రగరువు గ్రామంలో జిల్లా నాయకులు ఎల్ సుందరరావు ఆవిష్కరించారు. మండల నేతలు సూరిబాబు, బాలరాజు, సంజీవ్ తదితరులున్నారు.

గిరిజన ప్రజాప్రతినిధుల వైఖరి స్పష్టం చేయాలి

అరకులోయ రూరల్: బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ వైసిపి ప్రభుత్వం చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష జెఎసి జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్ చేశారు. మంగళవారం అరకువేలి గిరిజన భవనంలో ఆదివాసీ జెఎసి మండల కన్వీనర్ ఎల్.మహాదేవ్, కో కన్వీనర్ కిల్లో ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ, నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తూ అసెంబ్లీలో నిర్ణయం తీసుకుంటే, ఎస్‌టి రిజర్వేషన్‌తో గెలుపొందిన ఏడుగురు ఎమ్మెల్యేలు ఎలా మద్దతిస్తారని ప్రశ్నించారు. అసెంబ్లీ తీర్మానంపై ఎస్‌టి కమిషన్ రాష్ట్ర ఛైర్మన్, ఎమ్మెల్సీ కుంభారవిబాబు, అరకు ఎంపీ మాధవి మౌనంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గిరిజనులై ఉండి, తోటి గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే, దానికి ప్రశ్నించి నిలదీయకుంటే గిరిజన ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. మన్యం బంద్ నేపథ్యంలో 31న పర్యాటకులెవరూ ఏజెన్సీలోని పర్యాటక కేంద్రాలకు వచ్చి ఇబ్బందులు పడొద్దని సూచించారు.అయితే టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జెఎసి సలహాదారులు సోనాయి గంగరాజు, జనసేన అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి, వంపురు గంగులయ్య, హుకుంపేట జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, పెదలబుడు ఎంపిటిసి ఎల్సీ భీమరాజు, శత్రుఘ్న, దురియా ఆనంద్, వైస్ ఎంపిపి కిల్లో రామన్న, డివైఎఫ్ఐ నాయకులు నన్ని జానుబాబు, పాడి చందు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అరకు సమావేశంలో మాట్లాడుతున్న రామారావు దొర

వి.ఆర్.పురం: బోయ వాల్మీకి, బెంతు, ఒరియా కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఈ 31న జరగనున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని పలువురు ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక రేఖపల్లి క్రికెట్ గ్రౌండ్లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనం కోసం ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం దారుణమన్నారు. ఈ విషయంపై ఆదివాసీ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, పోరాటంలో కలిసి రావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనిచ్చేది లేదని హెచ్చరించారు. ఆదివాసీ నాయకులు పాయం లక్ష్మణ రావు, వేటూరి మల్లయ్య, పొడియం రాజు, పూనెం ప్రదీప్ కుమార్, చిక్కాల రామారావు, గొంది చంద్రయ్య, పండ వెంకన్న బాబు, సారా పాండు, భేతి రాజు, కల్ల సత్యనారాయణ, పండ వెంకటేష్, పండ రాజశేఖర్ పాల్గొన్నారు.

చింతూరు: బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని వైసిపి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆదివాసీ ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై దాడి తీవ్రతరం చేశాయని, 1/70, పీసా చట్టాలు అమలు కావడం లేదని, జిఒ 3ను రద్దుపై మాట్లాడటం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కోసం సుబ్బారావు, సీసం సురేష్, చిన్నారెడ్డి, సోడి నాగరాజు, వేకా రాజ్ కుమార్, పండ కష్టయ్య, బొగ్గ ముత్తయ్య, కె.బ్రహ్మయ్య, సోడే అశోక్, సీతారామయ్య పాల్గొన్నారు.



ఎటపాకలో మాట్లాడుతున్న అర్జున్ దొర

ఎటపాక : బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంపై గిరిజనులంతా ఐక్యమై పోరాడాలని, మార్చి 31న జరిగే మన్యం బంద్ విజయవంతం చేయాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్ దొర పిలుపునిచ్చారు. మంగళవారం మద్దులగూడెం గ్రామంలో బుద్దుల భద్రయ్య అధ్యక్షతన ఏపీ గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనులంతా ఏకపక్షంగా వైసిపికి ఓటు వేశారని, కృతజ్ఞత చూపించాల్సిన ప్రభుత్వం ఆదివాసీలపై కక్ష కట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నక్కా సూరిబాబు, సవలం రాము, పూనెం వెంకట్రావు, పర్షిక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

వి.ఆర్.పురం : బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం, ఏపి గిరిజన సంఘం ఆధ్వర్యాన మండల కేంద్రం కుంజ బుజ్జి నగర్, వెంకన్న గూడెంలో మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు కుంజ నాగిరెడ్డి, సోడి మల్లయ్య, సుందరయ్య, సుధీర్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

అఖిలపక్ష ప్రజాసంఘాల నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష రాజకీయ, ప్రజా సంఘాల నేతలు

జి. మాడుగుల :బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని అఖిలపక్షరాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం జి.మాడుగులలో సిపిఎం, టిడిపి,జనసేన, బిజెపి ఇతర రాజకీయ పార్టీలతోపాటు జిఒ3 సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలో 40 లక్షలు జనాభా కల్గిన బోయ/వాల్మీకులను ఎస్‌టిల్లో చేరిస్తే నిజమైన గిరిజనానికి అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతల మౌనం వీడి, గిరిజనుల పక్షాన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొమెలి చిట్టిబాబు, మండల అధ్యక్షులు వంతల కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి సాగెని ధర్మన్న పడాల్, జనసేన నేత మసాడి భీమన్న, బిజెపి నేత సుబ్బారావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు దీన బంధు, జిఒ3 సాధన కమిటీ సభ్యులు కోటిబాబు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి లకే రామకష్ణ, భీమ్‌బాబు పాల్గొన్నారు

విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం పూర్తి కాలేదు

- చీఫ్ ఇంజినీర్ శ్రీధర్



మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు

గోదావరి డెల్టాకు నీటి విడుదల నేపథ్యంలో సీలేరు కాంప్లెక్స్ పరిధి పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ సెంట్రల్ అథారిటీ నిర్దేశించిన విద్యుత్ ఉత్పత్తి టార్గెట్ ఈ ఏడాది రీచ్ అవ్వలేకపోయామని చీఫ్ ఇంజనీర్ బి శ్రీధర్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది నదీ పరివాహక ప్రాంతమైన ఒడిస్సాలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో బలిమెల జలాశయంలో ఆశించిన స్థాయిలో నీటి నిలువలు చేరలేదని తెలిపారు. దీంతోపాటు గోదావరి డెల్టా పంట పొలాలకు 12 టీఎంసీలు నీటిని, విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా విడుదల చేయవలసి వచ్చిందని చెప్పారు. దీంతో సీలేరు జల విద్యుత్ కేంద్రం కూడా ఉత్పత్తిలో టార్గెట్ రీచ్ కాలేదని పేర్కొన్నారు. డొంకరాయి పవర్ కెనాల్ గత ఏడాది గండి కారణంగా 20 రోజులు పాటు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ప్రస్తుతం సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో 6 నుంచి ఏడు మిలియన యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. గోదావరి డెల్టాకు ఈనెల 31 వరకు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరగకుండా 3000 క్యూ సెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 10 నుంచి ఈ నెలాఖరు వరకు 9.55 టీఎంసీల నీరు గోదావరి డెల్టాకు నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని బలిమెలా జలాశయంలో మన వాటా 15.8 టీఎంసీలు గుంటవాడ డొంకరాయి జలాశయాల్లో మరొక ఐదు టీఎంసీలతో కలుపుకొని 20.8 టీఎంసీలు నీటి నిలువలు మాత్రమే ఉన్నాయని వెల్లడించారు. రాబోయే రెండు నెలల్లో ఉన్న నీటి నిలువలను ఒక్క విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తేనే నీటి కొరత ఉండదని, వచ్చే నెల కూడా గోదావరి డెల్టాకి నీటిని విడుదల చేయవలసి వస్తే రాబోయే నెలల్లో విద్యుత్ ఉత్పత్తికి నీటి సమస్య తలెత్తే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఎటపాక, చింతూరు

జిల్లాలోని ఎటపాక, చింతూరు మండలాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఎటపాక మండలం గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన మడకం వెంకటేష్ (32) మంగళవారం చింతూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఇదే మండలంలోని లక్ష్మీపురం శివారులో చర్చి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ ఆయన్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా చెందిన చిదంబరం (51), ఆయన కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం హైదరాబాదులో ఉన్న తమ బంధువుల ఇంటికి కారు మీద వెళ్లారు. తిరిగి మంగళవారం వస్తున్న క్రమంలో చింతూరు మండలం బొడ్డుగూడెం వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న చిదంబరం అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న ఐదుగురు మహిళలకు గాయాలు కావడంతో ఏడుగురాళ్లపల్లి ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందజేస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థపై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-చింతూరు

ప్రజా పంపిణీ వ్యవస్థపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి ఫిర్యాదులపై విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని చింతూరు ఐటిడిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే స్పష్టం చేసారు. మంగళవారం చింతూరు ఐటిడిఎ సమావేశ మందిరంలో జిసిసి అధికారులు, ఎంఎల్ఎస్ ఇన్‌ఛార్జులు చౌక ధరల దుకాణాల డీలర్లు, సంచార వాహనాల ఆపరేటర్లుతో నిర్వహించిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ ఐదవ తేదీలోగా సంచార వాహనాలు ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు పంపించాలని ఆదేశించారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు తన దృష్టికి వస్తే సహించేది లేదని పిఒ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్. శివ ప్రసాద్, జిల్లా మేనేజర్ జి.గణేష్ కుమార్, సహాయ పౌర సరఫరాల అధికారి శ్రీహరి, జిసిసి మేనేజర్ ఎం.ఎన్. రాజా రెడ్డి, చింతూరు తహసిల్దార్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే

పివిటిజిల డేటా సేకరణపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసీలు (పివిజిటి) సామాజిక స్థితి గతులపై సమగ్రమైన డేటా సేకరించాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో 11 మండలాల ఎంపిడిఒలు, తాహశీల్దారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆదిమ జాతి గిరిజనులు (పివిటిజిలు) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలోని ఖోర్జ, గదబ, కోదు సామాజిక వర్గాల పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. పివిటిజి గ్రామాల్లో విద్యుత్తు, రహదారుల నిర్మాణాలు, తాగునీటి సదుపాయాల వంటి సామాజిక అభివృద్ధి, గృహ నిర్మాణాలు, స్వయం ఉపాధి పథకాలు వంటి వ్యక్తిగత లబ్ది చేకూరుతోందన్నారు. ఎంపిడిఒలు, తాహశీల్దారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సచివాలయం సిబ్బంది సహకారంతో పివిటిజిల జనాభా, ఉపకులాల వారీగా వివరాలతో సమగ్రమైన డేటా సేకరించాలన్నారు. . గతంలో సేకరించిన వివరాలలో తప్పులు ఉన్నాయని,అధికారుల సమన్వయంతో పని చేసి కచ్చితమైన డేటా సేకరించి, వారం రోజులలో సమర్పించాలని ఆదేశించారు. పివిటిజిల అభివద్ధికి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. తాగునీటి సదుపాయాలు, రహదారి సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, గహ నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యుత్ సౌక్యరాలు, డిఆర్ డిపోలు, సంక్షేమ పథకాల వివరాలు సేకరించాలని సూచించారు. గతంలో సేకరించిన డేటాలో ఉన్న తప్పులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐటిడిఎ ఎపిఒలు ఎం.వేంకటేశ్వరరావు, విఎస్ ప్రభాకరరావు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్, ఎంపిడిఒలు, తాహశీల్దారులు, గిరిజన సంక్షేమశాఖ ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, పిఐయు ఇఇ కె.లావణ్యకుమార్, పిఆర్ ఇఇ కొండయ్యపడాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ లీలాకృష్ణ, జిసిసి డిఎం కె.పార్వతమ్మ, పాడేరు ఎంపిడిఒ నవీన్ సాయి, 11 మండలాల ఎంపిడిఒలు పాల్గొన్నారు.

అన్నదానానికి విద్యార్థినులు వెళ్లడంపై ఆరా

ప్రజాశక్తి -పాడేరు : ఈ నెల 23న చింతపల్లి ఆర్‌వి.నగర్ గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థినులను పాఠశాలకు కిలోమీటరున్నర దూరంలో గ్రామదేవత జాతరలో ఏర్పాటు చేసిన అన్నసమరాధనకు వెళ్లారన్న వార్తలపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం స్పందించారు. అన్న సంతర్పణలో విద్యార్థినులు ఎందుకు పాల్గొన్నారు, దీని వెనుక ఉద్దేశ్యం ఏమిటి, దేవునిపై భక్తితో వెళ్ళారా, లేక ఉపాధ్యాయులు బలవంతాన పంపాంఆరోజు పాఠశాలలో ఎంత మంది భోజనం చేశారు, సంతర్పణకు ఎంత మంది వెళ్లారు తదితర వివరాలతో సమగ్ర సమచారాన్ని సేకరించి కమిషన్‌కు పంపాలని ఐటిడిఎ, జిల్లా ఉన్నతాధికారులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు నోటీసులు పంపినట్టు సీతారాం తెలిపారు. అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా చట్ట ప్రకారం చర్యలకు సిఫారసులు చేస్తామన్నారు. బాలల హక్కుల ఉల్లంఘనలుకు పాల్పడే అధికారులను,ఉపాధ్యాయులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని సీతారాం స్పష్టం చేశారు.

మొదటి కాంటూరులో ప్రాధాన్యత ఇచ్చి ప్యాకేజీ చెల్లించాలి

గ్రామసభలో ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి- విఆర్.పురం

భూమికి భూమి కోరుతున్న వారికి అన్నీ అనువుగా ఉండే భూమి చూపించాలని, రామవరం పంచాయతీ వెంకన్న గూడెం గ్రామస్తులకు 41.15 మొదటి ప్రాధాన్యత ఇచ్చి అందరికీ పరిహారం, పునరావాసం చెల్లించాలని విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన గ్రామసభలో అధికారులు గ్రామాల వారీగా వివరాలను, పిడిఎఫ్ డేటా ఆధారంగా నిర్వాసిత కుటుంబాలను చదివి వినిపించారు. అనంతరం తహశీల్దారు మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇచ్చిన గ్రామాలన్నింటికీ సాధ్యమైనంత వరకు పునరావాసం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా పలువురు నాయకులు, నిర్వాసిత గిరిజనులు మాట్లాడుతూ భూమికి పరిహారం, డికెటి పట్టాలను పరిశీలించి తమ సాగు భూములకు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. దీనిపై తహశీల్దారు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని చెప్పారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఆర్ అండ్ ఆర్ అధికారులకు గిరిజనులు అందజేశారు. ఈ గ్రామసభలో చొపల్లి సోములగూడెం గ్రామస్తులు తమకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్ కారం బుచ్చమ్మ, పంచాయితీ కార్యదర్శి ఎఎస్ తాతారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

అవగాహన లేకుండా ఎలా గ్రామసభ నిర్వహిస్తారు

చింతూరు : అధికారులకు అవగాహన గ్రామసభ ఎలా నిర్వహిస్తారని చింతూరు బీసీ కాలనీలో రెండో రోజు మంగళవారం జరిగిన పోలవరం ఆర్ అండ్ ఆర్ గ్రామసభలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు ఇల్లా చిన్నరెడ్డి అధికారులను ప్రశ్నించారు. మీకే అవగాహన లేనప్పుడు ముంపు ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తారని నిలదీశారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి పౌరుడు ఒక కుటుంబం అని, ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ 2013 చట్ట ప్రకారంగా అన్ని రకాల సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు కేవలం వాలంటీర్లపై నెట్టివేసి ప్రజలకు అవగాహన కల్పించడం లేదనడం అర్థరహితమన్నారు. ఇంటి విలువ ఆర్ అండ్ ఆర్ సంబంధించి ఆర్ అండ్ బి శాఖ వారు సర్వే చేసి విలువ కడతారని, అది ఎంతో కూడా తమకు తెలియదని ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన అధికారులు సభలో విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో సురేష్ బాబు. తహశీల్దారు కృష్ణ, ఎంపీపీ అమల, వైస్ ఎంపీపీ సుధాకర్, ఎస్ఐ శ్రీనివాసరావు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ పాల్గొన్నారు.

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన సివిక్ యాక్షన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ, బూసికొండ గ్రామంలో సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యాన మంగళవారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా 50 మంది గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు, 20 రేడియోలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు నితిల్ కుమార్, సౌమ్య గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, డిప్యూటీ కమాండెంట్ (రాజమండ్రి) బి రత్నమ్మ మాట్లాడుతూ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం ద్వారా పెద్దబూషికొండ, చిన్న బూషికొండ, పార్వతి నగర్ తదితర గ్రామాల్లో గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించినట్లు చెప్పారు. సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ సిస్టమ్‌ని అందజేశారు. అనంతరం ఏపీ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగద పురస్కారాలు అందజేశారు. అనంతరం గిరిజనులతో సిఆర్‌పిఎఫ్ పోలీసులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, సివిల్ సిఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేసిన సిఆర్‌పిఎఫ్ పోలీసులు

చింతూరు : చింతూరు మండలం, ఏడుగురాళ్లపల్లిలో సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ ధర్ ఆదేశాలు మేరకు మంగళవారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఏడుగురాళ్లపల్లి, పంచాయితీ విద్యానగరం, మద్దిగూడెంలో స్థానిక కొండరెడ్లకి, ఆదివాసీలు 300 మందికి బియ్యం, డ్రమ్ములు, కళాయిలు, కంచాలు, గ్లాసులు అందజేశారు. అంగనవాడీ చిన్నపిల్లలకు, ఆయా గ్రామాల్లో స్కూల్ పిల్లలకు కంచాలు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ డి 141 బి.ఎన్న వోసి టి కృష్ణారావు మాట్లాడుతూ ఏజెన్సీలోని యువత చెడు మార్గాలలోకి వెళ్ళవద్దని, మద్యానికి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సెకండ్ హ్యాండ్ కమాండెంట్ కమల్ వీర్ యాదవ్, సిఆర్పిఎఫ్‌డి 141 ఓసి టి.కృష్ణారావు, చింతూరు సీఐ అప్పలనాయుడు, ఎస్సై శ్రీనివాసరావు, సర్పంచులు సవలం సత్తిబాబు, సిఆర్పిఎఫ్, స్కూల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో పాల్గొన్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు, గిరిజనులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత శాంతకుమారి

నేడు కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్పించి, నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయ పోరాట నిరాహార దీక్ష చేపడుతున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర ఆదివాసీ చైర్‌పర్సన్, రాష్ట్ర కార్యదర్శి పి శాంతకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిరిజన వ్యతిరేక విధానాలను అవలంభిస్తూనే ఉందన్నారు.బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ. కేబినెట్‌లో తీర్మానం చేస్తే, రాష్ట్రంలో గిరిజనుల ఓట్లుతో గెలిచిన ఏడుగురు వైసిపి ఎమ్మెల్యేలు సహకరించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ దీక్షల్లో అధికసంఖ్యలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిసిసి సభ్యుడు పి చిన్న స్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఇ.దయానిధి, ఉపాధ్యక్షుడు బి సులోచన, మండల యూత్ అధ్యక్షుడు మదుసూదనరావు భాస్కరరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులతో పశువులు మృత్యువాత

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని మారుమూల దుర్గం పంచాయతీ, సరసపాడు పాటి గురువు, మత్స్యపురం పంచాయతీ కొత్త వలస, బి.బొడ్డపుట్టు పంచాయతీ బంద మామిడి తదితర గ్రామాల్లో పశువులు వ్యాదులు సోకి మృత్యువాత పడుతున్నాయని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు పారుకుంటూ నీరసించి పోయి, అలాగే అస్వస్థతకు గురై మరణిస్తున్నాయని, దీనిపై సచివాలయాలకు వెళ్ళి సంబంధిత వెటర్నరీ అసిస్టెంట్‌లకు చెప్పినా ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా పశు వైద్యాధికారులు, సిబ్బంది వ్యాధులు ప్రబలిన గ్రామాల్లో సందర్శించి, పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా పశుమరణాలను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



అనారోగ్యానికి గురైన పశువుల గుంపు



సర్వే ప్రారంభంలో సర్పంచ్ కోములు

ప్రతి ఒక్కరూ భూ రీసర్వే చేయించుకోవాలి

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: సమగ్ర భూరీసర్వేను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని కోర్రాయి పంచాయతీ సర్పంచ్ పూజారి కొములు కోరారు. స్థానిక రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కోర్రాయి పంచాయతీ పెద్ద అంజోడ గ్రామంలో భూ రీసర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలురికార్డుల్లో తప్పుగానమోదైతే సరిచేసుకునే అవకావం ఉంటుందని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విఆర్ఒ, సచివాలయ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా కాఫీ, జీడిమామిడి

విరగబూసిన కాఫీ మొక్కలు
గుత్తులుగా వేలాడుతున్న జీడిపిక్కలు
దిగుబడులపై గిరి రైతుల ఆశలు
అన్నీ అనుకూలిస్తే లాభాల పంటే

ప్రజాశక్తి -అనంతగిరి : సానుకూల వాతావరణంతో ఈ ఏడాది మన్యంలోని కాఫీ, జీడిమామిడి తోటలు ఆశాజనకంగా ఉన్నాయి.కొమ్మలు సైతం కనిపించనంతగా కాఫీ పూలు విరగబూస్తే, కొమ్మలు వాలిపోయేంతా గుత్తులుగా కాసిన జీడిపిక్కలు ప్రస్తుతానికి మంచి దిగుబడులు వస్తాయన్న ఆశలు రేకెత్తిస్తున్నాయి. పంట చివర వరకు ఇలాగే ప్రకృతి, పరిస్థితులు అనుకూలిస్తే గతేడాది కంటే రెట్టింపు దిగుబడులు, అధికాదాయం రావడం ఖాయమని మన్యంలోని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు సానుకూలంగా కురిసిన వర్షాలతో అనంతగిరి మండలంలోని అనంతగిరి, ఎగువశోభ, వేంగడ, టోకూరు, పైనంపాడు, కోనాపురం తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో



అనంతగిరిలో విరగబూసిన కాఫీ తోటలు



కాశీపట్టణంలో కొమ్మల నిండా కాయలతో జీడిపంట

విస్తరించిన కాఫీతోటలు ఇపుడు కొమ్మల నిండా పూతతో కళకళలాడుతున్నాయి. ఎపిఎఫ్‌డిసికి చెందిన వేలాది ఎకరాల్లో కాఫీ తోటల్లోని మొక్కలకు ప్రస్తుతమున్న పూల పరిస్థితిని బట్టి, కాయలు కూడా అదేస్థాయిలో వచ్చి మంచి దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. గతేడాది ఎకరాకు రూ.50వేలు నుంచి రూ.లక్షలోపే ఆదాయం సమకూరగా, ఈ ఏడాది పంట పరిస్థితులను బట్టి, మంచి ధర పలికితే రూ.రెండు లక్షల వరకు ఆదాయం వచ్చినా ఆశ్చర్యపోనక్కరలేదని ఏజెన్సీ రైతులు అంటున్నారు.
మరోవైపు మండలంలోనికొత్తూరు. కాశీపట్నం, భీంపోలు, గుమ్మకోట, గరుగుబిల్లి, చిలకలగెడ్డ, రొంపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాలలో జీడితోటలు అధికంగా విస్తరించి ఉన్నాయి. జీడిపంటకు సైతం ఇప్పటివరకు వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, ఆశాజనకంగా పూసిన పూత, తర్వాత పిందె దశను దాటిఇపుడు కొమ్మలకు గుత్తులుగా జీడికాయలు కనిపిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. చివరి వరకు వాతావరణం అనుకూలిస్తే జీడిపిక్కలన్నీ రూపాయలుగా మారి మంచి ఆదాయం వస్తుందని అంటున్నారు. మొత్తానికి మన్యంలో కాఫీ, జీడితోటలు ప్రస్తుతానికి ఆశాజనక పంటతో రైతుల్లో దిగుబడులపై ఆశలు రేకెత్తిస్తున్నాయి.

జోరుగా అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి -హుకుంపేట: అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపిన రెవిన్యూ అధికారులు, ఇలా కాస్త పట్టుసడలించారో లేదో మళ్లీ గిరిజనేతరులు రెచ్చిపోతూ, యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం అధికారులు చేపట్టిన చర్యలతో కొన్నాళ్ళు అక్రమార్కుల ఆగడాలు ఆగినట్టే కనిపించగా, అధికారులు కాస్త కన్ను చాటేయడమే అదనుగా జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రభుత్వస్థలాలను అక్రమించి, బినామీల పేర్లతో నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి మళ్లీ ఇలా అక్రమ నిర్మాణాలు కొనసాగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

5న చలో ఢిల్లీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పాడేరు : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. మంగళవారం చింతపల్లిలో గ్రామ సేవకులతో కలిసి చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను అవిష్కరించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు, రైతులు,బడుగుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రశ్నించే విపక్షాలు, ఇతర నేతలను వేధిస్తూ, అక్రమ కేసులతో జైలు పాల్జేస్తున్నారని దుయ్యబట్టారు. వీటికి నిరసనగా చేపట్టే చలో ఢిల్లీ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం నాయకులు లోచల కృష్ణారావు, సంఘం కార్యదర్శి .కిల్లో లైకోన్, బొబ్బిలి కృష్ణ, కుడుముల రమణబాబు. గెమ్మెలి సుందరరావు, సిహెచ్ కొండమ్మ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్నయ్యపడాల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం బాబూరావు

ప్రతిభకు నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి ముంచింగి పుట్టు: ఏజెన్సీ 11 మండలాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులకు లోకుల గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌గా రూ.15 వేలు చెల్లిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ గోకుల రమేష్ ప్రకటించారు. లబ్బురు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం తుడుము బాబురావుతో కలిసివిలేకర్లతో మాట్లాడుతూ, నేటి యువతరానికి ఆదర్శనీయుడైన లోకుల గాంధీ పేరిట నెలకొల్పిన ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిమండలంలోనూ పది ఫలితాల్లో టాపర్‌కు నగదుతోపాటు మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తామని ట్రస్ట్‌ప్రధాన కార్యదర్శి మఠం మురళీకృష్ణ తెలిపారు.

అందుబాటులో గ్యాస్

ప్రజాశక్తి డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని జిసిసి ఇండన్ గ్యాస్ గోడౌన్‌లో గ్యాస్ బండలు అందుబాటులో ఉన్నాయని అరుకు జిసిసి బ్రాంచ్ మేనేజర్ బుక్క వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ గోడౌన్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం గ్యాస్ ధర రూ 1130గా ఉందని, మండలంలో వినియోగదారుల సౌకర్యార్థం స్టాక్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. ఆశ్రమ పాఠశాల వసతి గహాలకు కూడా గ్యాస్ సప్లై చేస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోడౌన్స్ మేనేజర్ వెంకటేశ్వర్లరావు సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో మానవ జీవన ప్రమాణాల పెంపు

ప్రజాశక్తి-మధురవాడ : పర్యావరణ పరిరక్షణ, విద్యుత్తు, తాగునీటి వినియోగం, సహజమైన గాలి, వెలుతురు ఉపయోగించుకునే భవన నిర్మాణాలు ఆకర్షణీయ నగరాలలో అవసరమని, దీనికి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఉపయోగపడుతుందని, తద్వారా మానవ జీవన ప్రమాణాలు పెరుగుతాయని బ్రెజిల్ శాస్త్రవేత్త ఎన్ఎల్.విజయకుమార్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం పట్టణాలకు వలస వచ్చే ప్రజల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతూ వస్తోందని, 2100 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభాలో 80 శాతం పట్టణాలలోనే ఉంటారని ఆయన తెలిపారు. పట్టణాలలో పెరుగుతున్న జనాభా అవసరాలను గుర్తించడంతో పాటు ఉన్న వనరులను పొదుపుగా, సమర్థంగా ఉపయోగించుకోవడంపై ఆకర్షణీయ నగరాలు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఆకర్షణీయ నగరాలలోని బహిరంగ ప్రదేశాలలో సెన్సార్ల వినియోగం ద్వారా అనునిత్యం సమాచార సేకరణ, నీటి సరఫరాలో వృథాలను అరికట్టడానికి కృత్రిమ మేధతో లీకేజిల గుర్తింపు, విద్యుత్తును పొదుపుగా వాడడానికి స్మార్ట్ మీటర్ల వినియోగం, భవన నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నిర్మాణంలో సహజమైన గాలి వెలుతురు ఉండేలా చూసుకోవడం కీలక అంశాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను రక్షించడానికి, ప్రమాదాలను ముందుగా గుర్తించడానికి సెన్సార్లు ఉపయోగపడతాయని తెలిపారు. బ్రెజిల్‌తో సహ వివిధ దేశాలలోని ఆకర్షణీయ నగరాలలో అమలు జరుగుతున్న ప్రాజెక్టులను ఆయన వివరించారు. కార్యక్రమానికి సిఎస్ఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ శిరీష, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ జి.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లుపై సమావేశమైన నేతలు

శ్రీరామ నవమి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం
మండలంలోని శ్రీరామగిరిలోని ఈనెల 30న జరగబోయే శ్రీరామనవమి వేడుకులకు సంబంధించి రామాంజనేయ సీతారామచంద్రస్వామి వారి దేవాలయాన్ని ఎంపీపీ కారం లక్ష్మి స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మంగళవారం సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. శ్రీరామగిరి ఆలయ చైర్మన్ రేపు బాలరాజు, ఆలయ అర్చకులు సావిత్రి పురుషోత్తమాచార్యులుతో ఆలయంలో వివిధ అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రీధర్ మాట్లాడుతూ నవమి ఉత్సవాలు పూర్తయ్యే వరకు ఆయా శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భక్తుల రద్దీ అనుసరించి గ్రామంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్న బాబు, నాయకులు లక్ష్మణరావు, కాంతారావు, సోడి మల్లయ్య, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, ఆలయ చైర్మన్ బాలరాజు, జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఏప్రిల్‌లో పది వేల మందికి ఉపాధి లక్ష్యంగా ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య అధ్యక్షులు బివి.రామారావు వెల్లడించారు. హోటల్ దసపల్లాలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంస్థ ఏర్పాటుకుగాను అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 110 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరమన్నారు. తాము ఏర్పాటు చేసే కార్పొరేషన్ ద్వారా పరిశ్రమలకు ముడి సరుకు సరఫరా చేస్తామని వెల్లడించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదన్నారు. పబ్లిసిటీకి మాత్రమే ఈ సమ్మిట్లు ఉపయోగపడ్డాయన్నారు. రాష్ట్ర మంత్రులకు వారి శాఖల మీద అవగాహన లేదన్నారు.

ఆత్మహత్య వీడియో కలకలం

ప్రజాశక్తి - ఉక్కునగరం, అనకాపల్లి : వడ్లపూడి పరిధి తిరుమల నగర్‌కి చెందిన ఉక్కు ఉద్యోగి వరప్రసాద్ దంపతులు ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సెల్ఫీ వీడియో తీసుకుని బంధువులకు పంపించి అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. ఆ వీడియో చూసిన వరప్రసాద్ పిల్లలతో పాటు బంధువులు తీవ్ర ఆందోళన చెందారు. ఈ వీడియో సోషల్ మీడియాలోనూ వైరల్ అయింది. దీంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. విశాఖలో మంగళవారం ఏ మూల చూసినా ఈ ఘటన గురించే చర్చ సాగింది. వరప్రసాద్ కుమారుడు సాయి తేజ దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. సెల్ఫీ వీడియోలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగి వరప్రసాద్, అతని భార్య తమ జీవితాలను ముగించుకోబోతున్నట్లు పేర్కొన్నారు. ఏడుస్తూ కనిపించారు. తమ కూతురిని బాగా చూసుకోవాలని అల్లుడిని కోరారు. వారి ఆత్మహత్య నిర్ణయం వెనక కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆర్థిక కష్టాలే దీనికి కారణమని బంధువులు, స్థానికులు చెబుతున్నారు. అప్పుల వల్ల ఒత్తిడి తట్టుకోలేక ఇలా చేసినట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా దంపతుల ద్విచక్ర వాహనం, చెప్పులు, బ్యాగు, మొబైల్ అనకాపల్లి సమీపంలోని కొప్పాక ఏలేరు కాలువ వద్ద కనిపించాయి. దీంతో బంధువులు, పోలీసులు ఏలేరు కాలువ వద్ద గాలిస్తున్నారు. గజ ఈతగాళ్లను రంగంలోకి దించినా ఫలితం కానరాలేదు.

విశాఖలో జి 20 సందడి

విశాఖలో ఘనంగా ఐడబ్ల్యుజి సమావేశాలు ప్రారంభం
తొలి రోజు 'రేపటి ఆర్థిక నగరాల నమూనా ఎలా ఉండాలి?' అన్న అంశంపై చర్చ
గాలా డిన్నర్‌లో పాల్గొన్న సిఎం జగన్
విదేశీ ప్రతినిధుల రాకతో నగరంలో హై అలర్ట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ
విశాఖ నగరంలో జి - 20 దేశాల సందడి నెలకొంది. దేశ, విదేశీ ప్రతినిధులు తరలివచ్చారు. వారికి ఎపి ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. సిఎం జగన్ రాక, విదేశీ ప్రతినిధులతో భేటీ, అనంతరం గాలా డిన్నర్ వంటి కార్యక్రమాలతో విశాఖలో సరికొత్త వాతావరణం అలుముకుంది.
ప్రతిష్టాత్మకంగా మూడు రోజులు పాటు తలపెట్టిన జి - 20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ - 2 (ఐడబ్ల్యుజి) సమావేశాలు మంగళవారం విశాఖ సాగర్‌నగర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు 'రేపటి ఆర్థిక నగరాల నమూనా ఎలా ఉండాలి?' అన్న అంశంపై సుదీర్ఘంగా సభ్యుల్లో డిబేట్ జరిగింది. జి-20 దేశాల్లో 14 దేశాలకు చెందిన 57 మంది, అతిథి దేశాలకు చెందిన 8 మంది ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. 10 ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్లు ఈ చర్చలో భాగస్వాములయ్యాయి. పట్టణాలు, నగరాల్లో ఆర్థికపరమైన ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై డ్రాఫ్టు ముసాయిదాను సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యుంతా చర్చలు జరిపారు. పన్నుల విధానంపై 13 మంది అంతర్జాతీయ నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సదస్సు నేపథ్యంలో విశాఖలో హై అలర్ట్ నెలకొంది. ఎక్కడ చూసినా పోలీసులే కనిపించారు. ఎయిర్‌పోర్టు నుంచి సాగర్ నగర్ వరకూ ఉన్న అన్ని ప్రాంతాలూ పోలీసు వలయంలో ఉన్నాయి.



తొలి రోజు చర్చల్లో పాల్గొన్న విదేశీ ప్రతినిధులు

జి 20 ప్రతినిధులతో సిఎం జగన్ భేటీ

వివిధ దేశాల ప్రతినిధులతో సాయంత్రం వేళ సిఎం భేటీ అయ్యారు. తమ ప్రభుత్వం ఎపిలో అధికారంలోకి వచ్చాక 30 లక్షల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చిందన్నారు. 22 లక్షల ఇళ్లు కడుతున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో తమకు సరైన మార్గనిర్దేశకత్వం చేయాలని ప్రతినిధులను కోరారు.

ఘన స్వాగతం

సిఎం మంగళవారం సాయంత్రం 7.05 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర మంత్రులు విడదల రజిని, బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఆర్‌కె.రోజా, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మున్సిపల్ స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మి, టూరిజం స్పెషల్ సిఎస్ రజిత్ భార్గవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, శాసనసభ్యులు, గొల్ల బాబూరావు, కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ, శాసన మండలి సభ్యులు, వరుదు కళ్యాణి, నాగార్జున ఘనస్వాగతం పలికారు.




మాట్లాడుతున్న సిఎం జగన్మోహన్ రెడ్డి

జి-20 వసుదైక కుటుంబం పుస్తకం ఆవిష్కరణ

విమానాశ్రయంలో జి-20 వసుదైక కుటుంబం ఒకే భూమి - ఒకే కుటుంబం - ఒకే భవిష్యత్తు పుస్తకాన్ని రాష్ట్ర మంత్రులు ఆర్‌కె.రోజా, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్‌లు ఆవిష్కరించారు.

స్కూలు ఫీజులు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెంచిన స్కూలు ఫీజులు తగ్గించాలంటూ స్థానిక ఆల్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఫీజులు ఈ ఏడాది ఒక్కసారిగా 50 శాతం మేర పెంచడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యంపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని, ఫీజుల క్రమబద్ధీకరణకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలిసి సంఘటనా స్థలానికి చేసుకున్న ఎంవిపి సిఐ సిహెచ్.మల్లేశ్వరరావు విద్యార్థుల తల్లిదండ్రులను సముదాయించారు. తక్షణమే ఫీజులు తగ్గించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.



చర్చాగోష్టిలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

పోలవరంపై కేంద్రం నిర్లక్ష్యం తగదు

- అఖిలపక్ష రాజకీయ పార్టీల చర్చాగోష్టిలో నేతల డిమాండ్

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)
ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి వంటి పోలవరం జాతీయ ప్రాజెక్టు భవితవ్యం అగమ్యగోచరంగా తయారైందని, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆ ప్రాజెక్టును కేంద్రమే నిర్మించి జాతికి అంకితం ఇవ్వాలని రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. 'పోలవరం నిర్మాణం చేపట్టి ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలి' అంటూ ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో రాజకీయ పార్టీల చర్చా గోష్టి మంగళవారం జరిగింది. టిడిపి, సిపిఎం, సిపిఐ, జనసేన, కాంగ్రెస్, లోక్‌సత్తా, ఆప్ పార్టీల నేతలు పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టులు పునాది రాళ్లకే పరిమితమయ్యాయని, గతంలో పూర్తయిన ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తయి దశాబ్దాలు గడిచినా నిర్వాసితులకు నేటికీ పరిహారం అందలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అరకొర నిర్మాణాలు తప్ప అక్కడా జరిగిందేమీ లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ పోలవరంపై కేంద్రం చేతులెత్తేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడటం దారుణమన్నారు. డ్యాం ఎత్తు తగ్గిస్తే నీటి నిల్వ సామర్థ్యం 196.60 టిఎంసిల నుంచి 92 టిఎంసిలకు కుదించబడుతుందన్నారు. అలాంటప్పుడు ఇది బహుళార్థక జాతీయ ప్రాజెక్టుగా కాకుండా బ్యారేజీగా మారే ప్రమాదం ఉందన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎపికి జీవనాడిగా భావించబడే అతిపెద్ద ప్రాజెక్టును మరుగుజ్జుగా మార్చి వేసే కుట్ర జరుగుతోందన్నారు. అదే జరిగితే ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసుల ఆశలు అడియాశలవుతాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తికి అవకాశం, ఉత్తరాంధ్రకు కనీసం తాగునీరు అందే పరిస్థితి ఉండవన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును పూర్తి 45 మీటర్ల ఎత్తుతో 196.60 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎత్తు విషయంలో కేంద్రం మొండి వైఖరి వీడాలన్నారు. ప్రొఫెసర్ కెఎస్.చలం మాట్లాడుతూ 1986, 2022లో సంభవించిన భారీ వరదలను ప్రామాణికంగా తీసుకొని రీ సర్వే చేసి ముంపు గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలన్నారు. ముంపు ప్రాంతాల్లోని యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జనసేన రాష్ట్ర పిఎసి సభ్యులు కోన తాతారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జి.గోవిందరావు, ఆప్ నాయకులు లోకనాథం, సిపిఐ విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.పైడిరాజు, బి.వెంకటరమణ, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సీలేరు : విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కడియం గోపాలరావును మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదబయలు మండలం కోడసింగి గ్రామానికి చెందిన కడియం గోపాలరావు అనే వ్యక్తి జీకే వీధిలో పదో తరగతి చదువుతున్న బాలికను పెళ్లి పేరుతో వెంబడించి లైంగికంగా వేధించేవాడని తెలిపారు. బాలిక ఫొటోలు తీసి ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో సదరు బాలిక గుర్తించి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లిందని పేర్కొన్నారు. దీంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, నిందితుడిని అదుపులో తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.